**నమస్తే తెలంగాణ**

# ఇందిరమ్మ రాజ్యమా?!

**'గతకాలము** మేలు వచ్చు కాలము కంటెన్' అనే వారు ఉంటారు. 'మంచి గతమున కొంచెమేనోయ్' అనే వారూ ఉంటారు. ఏదేమైనప్పటికీ మంచి అనేది ముఖ్యం. సమాజ ప్రగతికి వెనుకచూపు కన్నా ముందుచూపు అవసరం. పాతను పాతరేసి, కొత్త వెలుగుల వైపు ప్రస్థానిస్తున్న సందర్భం ఇది. అయినా కాలం చెల్లిపోయిన, ప్రజల తిరస్కారానికి గురైన భావనలను కొందరు ముందుకు తెస్తూ ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల సీజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ లేనంత ఎక్కువగా ఇందిరమ్మను తలచుకోవడమే అందుకు ప్రబలమైన ఉదాహరణ. బహుశా ఇందిరమ్మ హయాంలో అనుభవించిన తిరుగులేని అధికారం కోసం అర్రులుచాస్తూ వారు అలా అంటున్నారేమో!

ఇంతకూ ఇందిరమ్మ రాజ్యం అంటే ఏమిటి? విదేశాంగ విధానంలో, రక్షణ రంగంలో ఆమె కొన్ని అద్భుతమైన విజయాలు సాధించి ఉండొచ్చు. అయితే చివరికి తాను సృష్టించిన ఖలిస్తానీ సమస్యకు తానే బలయ్యారు. ఇవి అందరికీ తెలిసిన విషయాలే. కానీ ఇందిరమ్మ రాజ్యాన్ని పదే పదే గుర్తుచేస్తున్నవారు దేశంలో జరిగిన అంతర్గత పాలన గురించే ప్రస్తావిస్తున్నారనేది స్పష్టం. కాంగ్రెస్ సర్వ భ్రష్టత్వం, తారస్థాయికి చేరిన వ్యక్తి ఆరాధన అనేవి ఆ పాలనకు తార్కాణాలుగా మిగిలిపోయాయి. 'ఇందిరాయే ఇండియా, ఇండియాయే ఇందిర' తరహా భజన పరత్వం చూసిన రోజులవి. అత్యంత కేంద్రీకృత పాలనకు ఆ రోజులు పేరు పడ్డాయి. ఢిల్లీకి కప్పం గడితే గల్లీలో ఇష్టారాజ్యం చెలామణీ అయ్యేది. కాంగ్రెస్ లోకల్ లీడర్ల దాష్టీకం ఎవరికి తెలియదు? గరీబీ హటావో అనే నినాదం ఇందిరదే. ఆ నినాదం ఏ మేరకు సాకారమైందో... ఏండ్ల తర్వాత కూడా ఉచితంగా బియ్యం ఇచ్చుకుంటున్న మనందరికీ తెలుసు. దేశంలో పేదరికం తరగకపోగా మరింత పెరిగింది. తెలంగాణ నేపథ్యంలో మాట్లాడుకుంటున్నాం కనుక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఎదుర్కొన్న సమస్యలేమిటో కూడా ప్రస్తావించుకోవాల్సి ఉంది. నెహ్రూ కాలంలోనే మేం విడిగా ఉంటామని తెలంగాణ ప్రజలు విస్పష్టంగా చెప్పారు. కానీ విడిపోయేందుకు అవకాశం ఉంటుందంటూ నయానా భయానా ఒప్పించి రెండు ప్రాంతాలను కలిపారు. ఆయన సునాయాసంగా చెప్పిన 'విడిపోవడమనేది' ఎంత కష్టంగా మారిపోయిందో తెలుసు. ఇందిర హయాంలో తొలిదశ ఉద్యమం పెల్లుబికితే దాన్ని దారుణాతి దారుణంగా అణచివేసింది ఆమే కదా. నాలుగు వందలకు పైగా యువకులను బలి తీసుకున్నది ఆమే కదా. తదుపరి జరిగిన ఎన్నికల్లో కోటి ఆశలతో ప్రజలు టీపీఎస్‌కు బ్రహ్మరథం పడితే, ఆ పార్టీ ఎంపీలను కాంగ్రెస్‌లో విలీనం చేసుకొని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అటకెక్కించిన ఘనత ఆమెదే కదా. బూటకపు ఎదురుకాల్పుల పేరిట యువకులను పిట్టల్లా కాల్చి చంపిన పోలీసు రాజ్యం ఎవరిది? ఇదేనా ఇందిరమ్మ రాజ్యం వల్ల తెలంగాణకు కలిగిన మేలు? సంక్షేమం పేరిట పేదల పొట్టకొట్టి, పెద్దల జేబులు నింపిన ఇందిరమ్మ రాజ్యాన్ని ఎలా మరువగలం? తెలంగాణ ప్రాజెక్టులను పండబెట్టిన, పొలాలను ఎండబెట్టిన ఇందిరమ్మ రాజ్యం మరోసారి కావాలని కోరుకునేదెవరు?

నిజానికి ప్రజలు ఏది మంచో, ఏది చెడో వారే నిర్ణయించుకుంటారు. సరైన ప్రత్యామ్నాయం వచ్చినప్పుడు సరైన తీర్పు చెప్తారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు జరిగింది అదే. ఈ దిక్కుమాలిన పాలన మాకొద్దని ఇందిరమ్మ రాజ్యాన్ని మూలకు పడేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కనీసం నువ్వోసారి నేనోసారి అనే ఏర్పాటు ఉండేది. కానీ సీఎం కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాంగ్రెస్ తెలంగాణకు చేసిన ద్రోహం ప్రజలకు విస్పష్టంగా తెలిసిపోయింది. మరోసారి ఇందిరమ్మ రాజ్యాన్ని తిరుగులేకుండా తిరస్కరించి బీఆర్‌ఎస్‌కు వరమాల వేశారు. ఒక విడత పాలన చూశాక నచ్చి మరోవిడత గెలిపించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ సాధించిన విజయాలు గల్లీ నుంచి ఢిల్లీ దాకా విఖ్యాతమైన సంగతి అవార్డులు, రివార్డుల ద్వారా రోజుకోసారి తెలుస్తున్నది. మరోవైపు ఈ దశాబ్దకాలంలో కాంగ్రెస్ పరిస్థితి నానాటికి తీసికట్టుగా తయారైంది. లిల్లీపుట్ల చేతుల్లోకి పోయి మరింతగా దిగజారింది. ఓటుకు నోటు బేహారులు సీట్లమ్ముకుంటున్న, సిగపట్లు పట్టుకుంటున్న వైనాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. అలవిమాలిన అధికార దాహంతో వదరుబోతులు వీరంగం వేయడం, రాజకీయ చర్చను అవాకులు చెవాకుల స్థాయికి భ్రష్టు పట్టించడం గమనిస్తూనే ఉన్నారు. అందరూ నచ్చిన, మెచ్చిన కేసీఆర్ పాలన కొనసాగాలనే ఆకాంక్షతో ముచ్చటగా మూడో విడత అధికారం అప్పగించేందుకు జనం సమాయత్తవుతున్నారనేది తిరుగులేని సత్యం.

# బీఆర్‌ఎస్‌తోనే ముదిరాజులకు భవిష్యత్తు



**డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్**

> తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ముదిరాజుల పరిస్థితి, రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ఏర్పాటైన బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ముదిరాజుల ప్రగతిపై సమగ్ర వివరణ, విశ్లేషణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏర్పడిన తర్వాత 17 మంది ముదిరాజులు మాత్రమే శాసనసభసభ్యులుగా అడుగుపెట్టగలిగారు.

2014.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముదిరాజులు అత్యధికంగా ఉన్నారని గ్రహించిన సీఎం కేసీఆర్ వారికి ప్రాధాన్యం కల్పించారు. సీఎం కేసీఆర్ ఇస్తున్న ప్రాధాన్యం చూసి మిగతా రాజకీయ పార్టీలు కూడా ముదిరాజులకు అవకాశాలు కల్పిస్తామని ఇప్పుడు ప్రకటిస్తున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ మొదటి నుంచి ముదిరాజులకు అవకాశాలు కల్పిస్తూనే ఉన్నది. దానిలో భాగంగానే ఉద్యమకాలంలో గోవిందగిరి ముదిరాజుకు, కృష్ణారావు ముదిరాజుకు, 2009లో ఈటల రాజేందర్ ముదిరాజు, మెట్టుకాడి శ్రీనివాస్‌లకు టికెట్లు కేటాయించింది. 2002లో పార్టీలో చేరిన ఈటెల రాజేందర్‌కు 2004లో కమలాపూర్ టికెట్ కేటాయించింది. 2009లో పార్టీలో అప్పటికే మంత్రి పదవులు చేసినవారున్నప్పటికీ అనేకమంది సీనియర్లను కాదని ఈటెల రాజేందర్‌కు ఫ్లోర్ లీడర్ పదవిని ఇచ్చారు. దీంతో సీఎం కేసీఆర్ ముదిరాజుల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు.

2017లో 64 మందితో ఉన్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీలో జనరల్ సెక్రటరీగా ఈ వ్యాసకర్తకు, సెక్రెటరీలుగా అందె బాబయ్య ముదిరాజ్, వీకే మహేష్, సఫన్ దేవ్ ముదిరాజులకు పదవులు ఇచ్చారు. ముదిరాజులకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడంలో బీఆర్‌ఎస్ పార్టీ, అధినేత కేసీఆర్‌కు స్పష్టమైన అవగాహన ఉన్నది. వాస్తవానికి ముదిరాజుల నుంచి గతంలో రాజ్యసభకు నామినేట్ అయిన దాఖలాల్లేవు. ఈ వ్యాసకర్తను రాజ్యసభకు పంపి ముదిరాజు జాతి పట్ల సీఎం కేసీఆర్‌కు ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. రాజ్యసభకు ఎన్నికవడం ఒక్కరిద్దరితో సాధ్యం కాదు. యావత్ బీఆర్‌ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతుతో, 34 మంది ఎమ్మెల్యేల ఓట్లతో రాజ్యసభకు ఎన్నిక జరుగుతుంది. డాక్టర్ బండా ప్రకాశ్‌ను రాజ్యసభకు పంపేందుకు 4 జిల్లాల ఎమ్మెల్యేలు ఓటు వేశారు. వీళ్లంతా వేర్వేరు జిల్లాల వారు. భిన్న కులాలు, విభిన్న మతాలకు చెందినవారు. అంటే ముదిరాజులకు రాజకీయ అవకాశాలపై బీఆర్‌ఎస్ పార్టీ ఒక స్పష్టతతో ఉన్నది. ఈటెల రాజేందర్ పార్టీని వీడిన తర్వాత చట్టసభల్లో ముదిరాజులకు అందుబాటులో ఉండేలా శాసన మండలికి పంపి అత్యున్నత పదవి అయిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా క్యాబినెట్ హోదాను కల్పించి సీఎం కేసీఆర్ ముదిరాజులను మరోసారి గౌరవించారు.

రాజకీయ పార్టీగా ముదిరాజుల సంక్షేమం, వారి ప్రగతిపై బీఆర్‌ఎస్ పార్టీ ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్నది. అందులో భాగంగా 2001 నుంచి నేటివరకు బీఆర్‌ఎస్ పార్టీ ముదిరాజుల సంక్షేమం కోసం కృషిచేస్తున్నది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 2004లో నారాయణ రావు, 2009లో ఆకుల రాజేందర్ శాసనసభ్యులుగా ఉన్నప్పటికీ ఎవ్వరికి మంత్రి పదవి వరించలేదు. కానీ, స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈటెల రాజేందర్ ముదిరాజుకు మంత్రివర్గంలో స్థానం కల్పించి పాలనలో ముదిరాజులకు ప్రాధాన్యం ఇచ్చి, భాగస్వాములను చేసింది.

ఎన్నికల సమయంలో పార్టీలు విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటాయి. వాటిని వివాదాస్పదం చేయడం రాజకీయ కుటిల నీతికి అద్దం పడుతుంది. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపికపై బీఆర్‌ఎస్ పార్టీ ఒక విధానపరమైన నిర్ణయం తీసుకున్నది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మరోసారి టికెట్లు ఇవ్వాలని నిర్ణయించింది.



దాని ప్రకారమే కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ప్రకటించారు. విధానపరమైన నిర్ణయం తీసుకోవడం వల్లనే ముదిరాజులకు ఈసారి అసెంబ్లీ టికెట్లను కేటాయించలేకపోయారు. అందుకు స్వల్పంగా మార్చిన సీట్లలో ముదిరాజులకు కేటాయించాలనే ఆలోచన పార్టీకి ఉన్నప్పటికీ మార్చిన స్థానాల్లో పోటీకి ఆసక్తి చూపే ముదిరాజు లీడర్లు లేకపోవడంతో అక్కడ టికెట్లు కేటాయించలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ప్రతి కార్యక్రమంలో ముదిరాజులకు ప్రాధాన్యం కల్పిస్తూనే ఉన్నది. పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న ముదిరాజులు వివిధ కారణాల వల్ల పార్టీకి దూరమైనందున పదవుల్లో ముదిరాజులకు స్థానం కల్పించలేకపోయింది.

బీఆర్‌ఎస్ పార్టీ అవకాశం ఉన్నచోటల్లా ప్రభుత్వంలో ముదిరాజులను భాగస్వాములను చేసింది. మొట్టమొదటిసారి న్యాయవ్యవస్థలో నలుగురు ముదిరాజు విద్యావంతులకు ప్రభుత్వ న్యాయవాదులుగా హైకోర్టులో అవకాశం కల్పించింది. అంతేకాకుండా సీఎం కేసీఆర్ నామినేటెడ్ పదవుల్లో కూడా అవకాశం కల్పించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్, మార్కెట్ కమిటీలు, దేవాలయ ధర్మకర్తల మండలిలలో కూడా అవకాశాలు కల్పించారు. రాష్ట్రంలో అతిపెద్ద మార్కెట్లకు ముదిరాజులను చైర్మన్లుగా నియమించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలిసారి మత్స్య సహకార ఫెడరేషన్ చైర్మన్‌గా ముదిరాజును నియమించింది. కాంగ్రెస్ పదేండ్ల కాలంలో ముదిరాజులకు ఇచ్చే అవకాశం ఉన్నా మంత్రి పదవి ఇవ్వలేదు. ముదిరాజులకు రాజకీయ పదవుల విషయంలో కూడా కాంగ్రెస్ అన్యాయమే చేసింది.

ముఖ్యమంత్రి కేసీఆర్ ముదిరాజులకు రాజ్యసభ మొదలుకొని స్థానిక సంస్థల వరకు జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిల్లో అవకాశాలు కల్పిస్తామని ప్రకటించడం ముదిరాజుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఒక లక్ష్యం, విశాల దృక్పథంతో ముదిరాజుల ఉమ్మడి ప్రగతి స్వావలంబన కోసం ప్రభుత్వం పని చేసింది. సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల్లో ముదిరాజులకు తెలంగాణ రాష్ట్రాభివృద్ధి అంశాల్లో ముదిరాజుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడింది. అస్థిరపరిచే రాజకీయాల కోసం విషపు బీజాలు నాటే ప్రయత్నాలకు ముదిరాజుల్లో ఉన్న ఐక్యత చెదిరిపోదు. బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్ పట్ల ఉన్న విశ్వసనీయతను ముదిరాజులు విస్మరించరు. ముదిరాజులకు ఆర్థిక స్వావలంబన, రాజకీయ సాధికారత మరింత చేకూరాలన్నా, భవిష్యత్తులో అవకాశాలు మెరుగ్గా ఉండాలన్నా కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని ముదిరాజులకు పిలుపునిస్తున్నాం. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలని కోరుతున్నాం.

**(వ్యాసకర్త: డిప్యూటీ చైర్మన్, శాసనమండలి, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు)**

# దేశాన్ని అమ్మిన బీజేపీ



**పబ్బతి శ్రీకృష్ణ**
95334 11328

ప్రభుత్వ బ్యాంకులను నిండా ముంచి, సుమారు 20 లక్షల కోట్లు ఎగ్గొట్టిన గుజరాత్ వ్యాపారులు అంబానీ, అదానీ, నీరవ్ మోదీ, లలిత్ మోదీలకు దేశ సంపదను దోచిపెట్టింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.

గుజరాత్ రాష్ట్రం నుంచే భారతదేశ పాలన జరుగుతున్నదనేది సుస్పష్టం. కరోనా సమయంలో ప్రపంచం అంతా అతలాకుతలమైంది. మన దేశంలో మాత్రమే గుజరాత్ కుబేరులు మరింత కుబేరులుగా వర్ధిల్లారు. దీనికి ప్రధాన కారణం మోదీ ప్రభుత్వం అదానీకి దేశ ఆర్థిక వనరులు మొత్తం గంప గుత్తగా చౌకగా అమ్మివేయడమే. బీఎస్‌ఎన్‌ఎల్, ఎల్ఐసీ, రైల్వేస్, ఎయిర్‌వేస్, కోల్ లాంటి అతిపెద్ద సంస్థలను గుజరాత్ వ్యాపారులకు అమ్మడం. నీరవ్ మోదీ, లలిత్ మోదీ, అంబానీ, అదానీ లాంటి వ్యక్తులు కేంద్ర బ్యాంకులను మోసం చేస్తే కనీసం వాళ్లను బ్లాక్‌లిస్టులో కూడా పెట్టలేదు. పోగా వారికి లక్షల కోట్లు రాయితీలిచ్చి రుణాలు మాఫీ చేయడం వారిపై మోదీకి ఉన్న ప్రేమను తెలియజేస్తున్నది.

ఆదివాసీలకు రాష్ట్రపతి పదవి ఇచ్చామని చెప్తున్న బీజేపీ అసలు ఎందుకు ఈ పదవి ఇచ్చిందో చెప్పలేదు. దేశాన్ని మొత్తం దోచుకున్నాం కానీ ఆదివాసీ ప్రాంతాలు ఇంకా మిగిలి ఉన్నాయి. ఒక ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా మార్చితే ఆదివాసీ ప్రాంతాలను కూడా మామూలు ప్రాంతాలుగా మార్చుకోవడానికి తద్వారా అక్కడ కూడా మైనింగ్ తరహా దోపిడీ చేసుకోవడానికి అవకాశం కేవలం రాష్ట్రపతి ఉత్తర్వులు ఉంటేనే సాధ్యమవుతుంది. అందుకే, ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా నియమించారు. మతాన్ని మాత్రమే వాడుకొని ప్రజల్లో అంతరాలు పెంచి ఒకరిపైన ఒకరు దాడి చేసుకునే లాగా ప్రజల మస్తిష్కాల్లో విషాన్ని నింపడంలో బీజేపీ, తన అనుచర శాఖలు విజయం సాధించాయి. దేశంలో గనుక మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే జరిగేది అభివృద్ధి కాదు, మారణ హోమం మాత్రమేనని మాల మహానాడు అభిప్రాయం. అందుకే బీజేపీని అధికారంలోకి రాకుండా ప్రజలను చైతన్యపరుస్తాం.

**(వ్యాసకర్త: మాల మహానాడు జాతీయ అధ్యక్షులు)**

# మాటల గారడీలో నిజమెంత?

> ఓటుకు నోటు కేసులో ప్రత్యక్షంగా చిక్కిన నేత కాంగ్రెస్ ప్రచార సభల్లో మాయమాటలతో యువకుల్లో భావోద్వేగాన్ని బాగా రెచ్చగొట్టి తిమ్మిని బమ్మి చేసైనా అధికారాన్ని పొందాలని తపన పడుతున్నాడు. బీఆర్‌ఎస్ వాళ్లను దొంగలని, మోసకారులని, సన్నాసులని నోటికొచ్చిన కారుకూతలు కూస్తున్నాడు. కేసీఆర్‌ను సైతం ముక్కుపొడుగు వాడని, నేలకు రాసినా తప్పులేదని అసభ్యకరమైన, అభ్యంతరకరమైన పదాలతో పేలుతున్నాడు. ఏ రోటికాడి పాట ఆ రోటికాడ పాడుతూ పబ్బం గడుపుతున్నాడు.



**పాందూరు ప్రభాకరరావు**
90106 31727



తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకించడం లేదని, ఆత్మగౌరవాన్ని నిలబెట్టి తెలంగాణ రాష్ట్ర సాధనకు సహకరించడం లేదని మాత్రమే కేసీఆర్ కాంగ్రెస్ వాళ్లను సన్నాసులు అన్నారు. అధికారం కోసం కాదు. అదీ తేడా. అందుకే ఈ సన్నాసిని ఎవరూ నమ్మవద్దు.

మోతీలాల్ నెహ్రూ ఈ దేశం కోసం తన ఆస్తులను, ప్రాణాలను త్యాగం చేశాడని, నెహ్రూ స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్నాడని, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాన్ని త్యాగం చేశారని, సోనియాగాంధీ ప్రధాని పదవిని సైతం త్యాగం చేశారని పదే పదే వల్లిస్తున్నాడు. ఈ రాజకీయ నాయకుడికి టీడీపీలో ఉన్నప్పుడు ఇవన్నీ గుర్తు రాలేదా? వచ్చుంటది. తాను ఊసరవెల్లి కదా? ఇక నిజాలు చూస్తే స్వాతంత్య్ర పోరాటంలో మోతీలాల్ నెహ్రూ మితవాది. బ్రిటిష్‌వారికి ఊడిగం చేస్తే స్వాతంత్య్రం వస్తుందని నమ్మినవాడు. తొలి ప్రధాని నెహ్రూ అయితే మొదటి ప్రణాళికలో పారిశ్రామికాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రణాళికలో వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో వ్యవసాయరంగానికి మన దేశంలో టేక్ ఆఫ్ స్టేజీ రాలేదు. ఇప్పటికీ పప్పుధాన్యాల కోసం, నూనెల కోసం ఇతర దేశాల పైన ఆధారపడిన స్థితి. మరొకవైపు వ్యవసాయ రంగానికి కావలసిన ఇన్‌పుట్స్ పారిశ్రామిక రంగం అందించడం లేదు. అటు పారిశ్రామిక రంగానికి కావలసిన ఇన్‌పుట్స్ వ్యవసాయ రంగం అందించడం లేదు. దీనినే లింకేజీలు తెగిపోవడమంటారు. వర్తక నిబంధనలు చూస్తే ఈ దేశంలో పారిశ్రామిక రంగానికి వర్తక నిబంధనలు అనుకూలంగా ఉన్నాయని చొక్కారావు కమిటీ అభిప్రాయపడ్డది. ఇది కాంగ్రెస్ ఆర్థిక విధానం కాదా?

1975లో దేశ ప్రధాని ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పు ఇస్తే ఎమర్జెన్సీ విధించింది కాంగ్రెస్ కాదా? ఎందరో నేతలను జైల్లో పెట్టింది కాంగ్రెస్ కాదా? ప్రతిపక్షాలను మింగి వేయాలని ప్రయత్నించింది కాంగ్రెస్ కాదా? 1969లో అధికారం కోసం తెలంగాణ ఉద్యమంపైన నీళ్లు చల్లింది కాంగ్రెస్ నేతలు కాదా? పంజాబ్‌లో అధికారం కోసం బింద్రన్‌వాలే నాయకత్వంలో ఉగ్రవాద మూకలను పెంచిపోషించింది కాంగ్రెస్ కాదా? ఆ మూకలే ఇందిరాగాంధీ ప్రాణాలను బలిగొన్నాయి. ఇది తెలియని ఓటర్లున్నారా? శ్రీలంకలో జరిగిన ఊచకోతకు ప్రతీకారంగా తమిళ ఈలం లిబరేషన్ ఫ్రంట్ (ఎల్టీటీఈ) రాజీవ్‌గాంధీ ప్రాణాలను బలిగొన్నది. 21వ శతాబ్దంలోకి ఈ దేశాన్ని తీసుకువెళ్లాలని ఇతర దేశాల నుంచి నాసిరకం, రెండవరకం యంత్రాలు దిగుమతి చేసుకొని వాటితో ఉత్పత్తి చేసిన వస్తువులు అంతర్జాతీయ మార్కెట్లో పోటీ పడలేక అప్పులు పెరిగిపోయి అప్పులు పుట్టని స్థితి వచ్చింది మనకు. లండన్‌లో 29 టన్నుల బంగారాన్ని కుదవబెట్టింది కాంగ్రెస్ కాదా? అంతర్జాతీయ మార్కెట్లో బహిరంగంగా రూపాయి విలువను తగ్గించుకున్నది కాంగ్రెస్ కాదా? ఇలా ఎన్నో ఉదంతాలు. అందుకే గారడి మాటల వలలో పడి మీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి. ఇప్పటికీ రాహుల్‌గాంధీకి ఇల్లు లేదట. ఎంత గారడి ఇది! కానీ హెరాల్డ్ పత్రిక కేసులో రాజీవ్‌గాంధీ ఇప్పటికీ ముద్దాయిగా ఉన్నాడు. సోనియాగాంధీ అల్లుడైన రాబర్ట్ వాద్రా పైన కూడా కేసులున్నాయి. అసలు కుంభకోణాలకు పునాది వేసిందే కాంగ్రెస్.

ప్రజాస్వామ్యంలో ఓటరే రాజు. తన రాజ్యం బాగుండాలంటే రాజకీయ పార్టీల రాజకీయ నాయకుల గతం, వర్తమానం, భవిష్యత్తు గుర్తించాలి. లేకపోతే తన గోతిని తానే తవ్వుకున్నవారవుతారు. కొంతమంది పొద్దాక ఎదుటివాళ్లను తిట్టిపోయడమే పనిగా పెట్టుకున్నారు. చెప్పంగ చెప్పంగా అబద్ధాలు నిజమవుతాయని. నిజాలు అబద్ధాలు అవుతాయని. దీన్ని ఓటర్ రాజు నమ్మితే ఖతమే మరి. కొంతమంది నాయకులు కాళ్లకు బలపం కట్టుకొని మరీ తిరుగుతూ పొద్దున్న లేస్తే పచ్చి అబద్ధాలు వల్లిస్తున్నారు. ఏమిటిది? సీమాంధ్ర గుప్పెట్లో బక్కచిక్కిన తెలంగాణ కోసం ఏనాడైనా వీళ్లు కాలుకి బలపం కట్టారా? కానీ వారి గురివింద చందం తెలంగాణ ప్రజలకు తెలుసు. నాడు అస్తిత్వం కోసం పోరాడి అమరత్వానికి సైతం వెనుకాడని తెలంగాణ.. నేడు అభ్యుదయ పథంలో అగ్రగామి రాష్ట్రంగా నిలిచింది. రైతు సంక్షేమ రాష్ట్రమని దేశంలో కీర్తి గడిచింది. ఆదర్శవంతమైన పల్లెలు, పట్టణాలతో అనేక జాతీయ ర్యాంకులు పొంది దేశవ్యాప్తంగా ప్రశంసలను అందుకుంది. తెలంగాణ అభివృద్ధి మాడల్‌ను వివరించమని అంతర్జాతీయ సంస్థలు ఇక్కడి నేతలను పిలుస్తున్నాయి. అంతర్జాతీయంగా పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు స్వర్గధామంగా మారింది. ఈనగాచి నక్కలు పాలు చేయొద్దు.

దొంగల చేతికి అధికార దండం ఇస్తే ప్రజలకు మిగిలేది ఖాళీ చిప్ప మాత్రమే. పవిత్రమైన ఓటు పుష్పాన్ని మహనీయులకు మాత్రమే సమర్పించాలి. అప్పుడే ఆ పుష్పానికి విలువ. అది మన అభివృద్ధికి పునాది. ఈ మానవ రూపంలోని రాబందులకు ఓటు వేస్తే గుడిని గుడిలో లింగాన్ని మింగేస్తారు. అందుకే ఓటరు మహాశయులారా! ఏడు దశాబ్దాలుగా ఏ ప్రధాని సైతం, ఏ ముఖ్యమంత్రి సైతం ప్రజానాడి ఇంతగా పట్టలేదు. వారి బాధలను గమనించలేదు. తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ అన్నం పెట్టాడు. ఆత్మగౌరవాన్ని ఇచ్చాడు. అక్కున చేర్చుకున్నాడు భాషకు, యాసకు ప్రాణం పోశాడు. ఎంతమంది ఈతి బాధలో తీర్చి వారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచాడు. మరి ఇప్పుడు ఆయన్ను మనం అక్కున చేర్చుకోవాలి. ఇది ఉన్న ఇల్లు, తిన్నరేవు మరవని తెలంగాణ ప్రజల సంస్కృతి. అప్పుడే వివిధ వర్గాలు చేసిన పాలాభిషేకానికి అర్థం. అభిషేకం మహనీయులకు మాత్రమే జరుగుతుంది. కోరిన కోరికలు తీర్చాలని ఎన్నోరకాల అభిషేకాలు జనం మహనీయులకు మాత్రమే చేస్తారు. మనం కేసీఆర్‌కు ఓట్లతో అభిషేకం చేద్దాం. తెలంగాణ ప్రజలు నీళ్లు, నిధులు, నియామకాల కోసం పడిన గోస అంతా ఇంతా కాదు. అదో పీడన, నరక యాతన. దానినుంచి బయటపడేసిన మహనీయుడు కేసీఆర్. ఇదొక నామవాచకం మాత్రమే కాదు. ఉద్యమ క్రియా పదం. ఆయన సామాన్యుడే. ఆయన జీవన గమనం, నిర్వర్తించిన కార్యం మహోన్నతం, ప్రేరణాత్మకం, అసామాన్యం. అందుకే యువకులారా, మహిళలారా! రెచ్చగొట్టేవారి భావోద్వేగాలకు బలికాకండి. మరొక్కసారి తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుతెచ్చుకోండి.

# కేసీఆర్.. ద లీడర్

> 'కేసీఆర్‌ను మించిన నాయకుడున్నడా...' రాజకీయ శత్రువులు సైతం అంతర్గత సంభాషణల్లో మాట్లాడుకునే మాట ఇది. హృదయంతో ఆలోచించేవాడు, భావోద్వేగంతో నిర్ణయాలు తీసుకునేవాడు కచ్చితంగా మానవతావాది అయ్యుంటాడు. అందుకే ఆయన నిర్ణయాలెప్పుడూ ప్రజాహితమైనవే అయి ఉంటాయి. సాంకేతికపరమైన లోపాలుండవచ్చునేమో కానీ, నిర్ణయం ఎప్పుడూ తప్పు కాలేదు. తొందరపాటు కాలేదు.

> వచ్చిన ఆలోచనను ఒక నిర్ణయంగా మలచుకునే ముందు సంబంధిత అధికారులతో, నాయకులతో, మేధావులతో చర్చించడం, వాళ్లు ఇచ్చిన సలహాలతో నోట్స్ రాసుకోవడం ఆయన అలవాటు. ఆ క్రమంలో మేధోమథనంలో, మానవీయ కోణంలో నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ. ఆయనొక నిరంతర విద్యార్థి.



**సునీత రావులపల్లి**
99857 99966



మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు తనను గెలిపించిన ప్రజలకేదో చేయాలన్న తపన తప్ప ఎలా చేయాలో, ఏం చేయాలో తెలియని స్థితి. మూడు నెలల పాటు అన్ని డిపార్టుమెంట్లు తిరిగి ఆఫీసర్లను తన దగ్గర కూర్చోబెట్టుకొని మాట్లాడి, చర్చించి విషయాలను అవగాహన చేసుకొని కార్యాచరణకు పూనుకున్నానని ఒక సంభాషణలో కేసీఆర్ చెప్పారు. ఆ అంకితభావమే ఆయనను ఓటమి ఎరుగని నాయకుడిగా నిలబెట్టింది. ఆ స్వభావమే ఆయనకు రాష్ట్ర నాయకత్వంలోనూ అగ్రనాయకుడిగా నిలిపింది. ప్రజలను ప్రేమించే గుణమే స్వభావమైన నాయకుడు, వాళ్ల కోసం అంకితభావంతో ఉన్న గొప్ప నాయకుడు దొరకడం తెలంగాణ ప్రజల అదృష్టం.

మానవత, మేధోసంపత్తి, సున్నితమైన హృదయం, లోతుగా అన్వేషించే విజ్ఞత, దూరదృష్టి.. రాష్ట్రానికి ఇంకేం కావాలని నిత్య ఆలోచన, స్పష్టత, ప్రజలను గౌరవించే సంస్కారం ఇవన్నీ కలిగిన అరుదైన నాయకుడు చంద్రశేఖర్‌రావు. ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్న అఖండుడు. ఈ గుణాల్లో ఒక్కటంటే ఒక్కటైనా ఏ ప్రతిపక్ష నాయకుడికైనా ఉన్నాయా? అబద్ధాలు, ఆచరణ లేని అసత్య హామీలు తప్ప, అసలు వాళ్లేం మాట్లాడుతున్నారో వాళ్లకైనా అర్థం అవుతోందా? నాయకుడి లక్షణం కూడా తెలియని మరుగుజ్జు స్వభావాలు. ఏండ్ల తరబడి నడిపిన ప్రజా ఉద్యమమైనా ఒక్క చుక్క నెత్తురు నేల రాలిందా.. రక్తపాతం లేకుండా అంతంత ఉద్రేకాలను నిలువరించగలగడం ఎక్కడైనా దేశంలో జరిగిందా? అహింసతో పోరాడి రాష్ట్రం సాధించిన మన గాంధీ మన కేసీఆర్.

కుర్చీ కోసం నిత్య హింసకు ప్రోత్సహించిన కాంగ్రెస్ నాయకులతో, వాళ్ల చరిత్ర, స్వభావాలతో మన నాయకుడిని పోల్చుకోగలమా? ఒక తండ్రిలా మన హితం కోరిన మన నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావును కాపాడుకుంటాం. ప్రజలు అందుకు సిద్ధంగానే ఉన్నారు. కేసీఆర్ సభల్లో కనిపిస్తున్న ప్రజల హావభావాలు, ఉత్సాహ తరంగాలే అందుకు నిదర్శనం. ఈ ఉత్సాహం కాంగ్రెస్ సభల్లో మచ్చుకైనా లేదు. చప్పట్లు, కేకలు అడుక్కోవాల్సి వస్తున్నది. అందుకే నేనంటాను. ప్రజలు విజ్ఞులు. ఎవరినెక్కడ ఉంచాలో వారికి బాగా తెలుసు.

కృతజ్ఞతతో కూడిన ఆనందం అది. తమ బాగోగులు చూసే ఇంటి పెద్ద లాంటి అందరి 'బాపు' పట్ల గౌరవం, అభిమానం, ప్రేమ అలా కాకుండా ఇంకెలా వెల్లడించుకోవాలో తెలీని పల్లెల భాష అది. ఇంట ఒక ఆడబిడ్డ పుడితే పుట్టిన నాటినుంచే దిగులు పడే సమాజం మనది. ఆర్థికంగా భారం అని, ఎదుగుతా ఉంటే తల్లిదండ్రులకు తానొక బరువు అవుతాననే దిగులు ఆడబిడ్డకు. రెండువైపులా ఆ బాధను తీర్చిన పెద్ద బాపు కేసీఆర్. పెండ్లికి సాయం, కాన్పుకు సాయం వరకే కాదు, గర్భంలో ఉన్నప్పటి నుంచీ లోపలి బిడ్డకీ, తల్లికీ అవసరమైన పోషకాలందించడం, మందులు అందించడం అంటే రాబోయే తరం ఆరోగ్యంగా ఉండటానికి కూడా శ్రద్ధ తీసుకునే పెద్ద తండ్రి ఆయన. ఈ ఆలోచన ఇదివరలో పాలించిన ఎందరికి వచ్చింది? ఆడబిడ్డ గర్భం దాల్చిన దగ్గరి నుంచి ఆ ప్రైవేటు హాస్పిటళ్లలో జరిగే అనవసర ఆపరేషన్లను తప్పించి, గవర్నమెంటు దవాఖాన్లలో సుఖ ప్రసవం చేయించి రూ.12–13 వేలు మంచి ఆహారం కోసం ఇచ్చి.. బిడ్డకు కిట్ అందించి, సారె బెట్టి ఇంటికి పంపిన తండ్రి లాంటి నాయకుడిని చూశామా? ఎంతసేపూ తమ గురించే ఆలోచన.. ఎలా అధికారంలోకి రావాలి.. ఎలా దాన్ని నిలబెట్టుకోవాలి. ఢిల్లీ పెద్దలకు ఎంత పంచాలి.. ఇదేగా వాళ్ల ఆలోచన.

పింఛనంటే భిక్షం కాదు. పెద్దల ఆత్మగౌరవం. క్రమంగా దాన్ని పెంచి ఎవరి మీదా ఆధారపడే అవసరం లేని ఆత్మవిశ్వాసాన్ని అందించడం, ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచడం. ఏ తాత, ఏ అవ్వ మరిచిపోతారు? కొడుకులా భుజం తట్టి ఆసరా అయిన దేవుడిచ్చిన 'కొడుకు'ని. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అన్నీ రాయాలంటే పేజీలు చాలవు. ఇప్పుడు అధికారంలోకి రావాలనుకున్నవాళ్లు మన మనసున్న మా రాజుకు సమానం కాగలరా? అంతటి ఆలోచన చేయగలరా ఈ మరుగుజ్జు మెదడు గాళ్లు? తెలంగాణలో ఏ మూల ఏ సమస్యలున్నాయో ఆయనకు తెలుసు. వాటినెలా పరిష్కరించాలో ఆ మెదడు మథిస్తూనే ఉంటుంది. ఒక్కొక్కటీ పరిష్కారం చేయడానికి కసరత్తు జరుగుతూనే ఉంటుంది. ఆ కసరత్తు ఫలితమే దేశంలో ఎక్కడా ఎవరూ చేయలేని విద్యుదుత్పత్తి. ఆ ఉత్పత్తి చేసిన విద్యుత్తును నిరంతరాయంగా రైతులకు, పరిశ్రమలకూ, ప్రజా అవసరాలకు పంపిణీ చేయడం. విద్యుత్తు సరఫరా వల్ల రాష్ట్ర సంపద పెంచడం.. దేశంలో ఏ ముఖ్యమంత్రీ ఎందుకు చేయలేకపోయారు. ప్రజల పట్ల ప్రేమ, అంకిత భావం లేకనే. వాళ్లలో వాళ్లు కొట్టుకుచావడమే మనం చూశాం ఇప్పటివరకూ.. అధికారం ఇస్తే రోజూ కుమ్ములాటలు తప్ప మనల్ని పట్టించుకునే నాథుడు ఉండడు.

మనకున్న పరిపక్వత కలిగిన నాయకత్వాన్ని మనం కాపాడుకుందాం! సొంత ప్రయోజనాలు తప్ప ప్రజలను ప్రేమించే నాయకత్వం వాళ్లకు లేనందుకు ఎన్నో రాష్ట్రాల ప్రజలు మనలను చూసి అసూయపడటం నాకు తెలుసు. సాహిత్యాన్ని ఔపోసన పట్టిన పండితుడు, కవిత్వం రాయగలిగిన సున్నిత మనస్కుడు. దేనినైనా అంతుచూడగల లోతైన ఆలోచన కలిగిన అపర చాణక్యుడు. ఉక్కు గుండె గల సాహసికుడు. గంగమ్మ తల్లిని చేయి పట్టుకుని మన చేలల్ల పారించిన అపర భగీరథుడు. అన్నీ ఆయనే. ఇన్ని గుణాలు ఇముడ్చుకున్న నాయకుడు మరొకడుండడు. అతడు కేసీఆర్ ఒక్కడే! ఆ ఒక్కడూ నాయకుడవడం మన అదృష్టం. నిలబెట్టుకుందాం! గెలిపించుకుందాం!! కేసీఆర్ సార్ మీకు అండగా మేమున్నాం...